క్లుప్తంగా

సేవలో ముందుండాలి

• ఎమ్మెల్యే విజయరమణారావు



సుల్తానాబాద్‌రూరల్: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ ముందుండాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని కదంబపూర్ గ్రామానికి చెందిన ఎస్ఆర్ఐ ముద్దసాని సుధీర్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సమకూర్చిన బ్యాగ్స్, నోట్ బుక్స్‌ను బుధవారం పంపిణీ చేశారు.

గ్రామ దేవతలకు ఎమ్మెల్యే పూజలు

ఓదెల: బాయమ్మపల్లె గ్రామంలో బుధవారం నిర్వహించిన జరిగిన భూలక్ష్మి, మహాలక్ష్మి బొడ్రాయి పూజల్లో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొన్నారు.

భూసేకరణ అభ్యంతరాల పరిష్కారానికి చర్యలు

పెద్దపల్లిరూరల్: మంచిర్యాల–వరంగల్ జాతీయ రహదారి నిర్మాణానికి జిల్లాలో 204.46 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉందని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశమై, సూచనలు చేశారు. ఫిబ్రవరి 23న 152.26 హెక్టార్ల భూమి నోటిఫై చేశామన్నారు. మంచిర్యాల–వరంగల్ ఫోర్‌లేన్ కారిడార్ నిర్మాణం వల్ల చెట్లు, బావులు తదితర ఆస్తులు నష్టపోతున్నామని వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎంచుకున్న లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటి, సంరక్షించాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై, పలు సూచనలు చేశారు. పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

'ఓర్వలేకనే మంత్రి శ్రీధర్‌బాబుపై ఆరోపణలు'



మాట్లాడుతున్న సదానందం, బాలాజీ

ముత్తారం: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మంత్రి శ్రీధర్‌బాబు చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ఆయనపై అర్థరహిత ఆరోపణలు చేస్తున్నారని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, ముత్తారం మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ అన్నారు. బుధవారం ముత్తారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మంథని ప్రాంతాన్ని అవినీతి, హత్యల మాయంగా మార్చిన ఘనత పుట్ట మధుకర్‌కే దక్కిందని విమర్శించారు. మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబును అనవసరంగా విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, నాయకులు గాదం శ్రీనివాస్, అనుము రామస్వామి, సమ్మయ్య, దాసరి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను కూల్చినవారిని శిక్షించాలి



శ్మశానవాటికను పరిశీలిస్తున్న సురేశ్‌రెడ్డి

ఓదెల: శ్మశానవాటికను కూల్చినవారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఓదెల మండలంలోని గుంపుల గ్రామంలో రిలే నిరాహార దీక్ష చేపట్టిన బీజేపీ నాయకులకు సంఘీభావం తెలిపారు. కేంద్ర నిధులతో నిర్మించిన శ్మశానవాటికను కూల్చిన వారిని గుర్తించడంలో పోలీసులు విఫలమయ్యారని అన్నారు. హిందూవాహిని జిల్లా సహాయ కార్యదర్శి సాయి, చిరంజీవి, బీజేపీ నాయకులు కృష్ణ, నిరంజన్, మల్లేశం, శ్యాం, వెంకటేశ్ పాల్గొన్నారు.

చొప్పదండి ఎమ్మెల్యేకు పరామర్శ



ఎమ్మెల్యే సత్యంను పరామర్శిస్తున్న మనోహర్ రెడ్డి

జూలపల్లి: నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను పరామర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే సతీమణి రూపాదేవి ఆత్మహత్య చేసుకోగా హైదరాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లి, ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన వెంట పలువురు చొప్పదండి నాయకులున్నారు.

10 జీపీఏ లక్ష్యంగా పని చేయండి

• ఉపాధ్యాయులు బోధన ప్రమాణాలు పెంపొందించుకోవాలి
• కలెక్టర్ కోయ శ్రీహర్ష
• ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



రామగుండం ప్రాథమిక పాఠశాలలో కలెక్టర్ శ్రీహర్ష

రామగుండం: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బోధన ప్రమాణాలను పెంపొందించుకోవాలని, ప్రతీ విద్యార్థి రాతలో, చదువులో సామర్థ్యం పెంచాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం రామగుండం పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐదోతరగతి గదిలో విద్యార్థులతో పలు సబ్జెక్టులపై మాట్లాడారు. ఈ విద్యాసంవత్సరంలో పదోతరగతిలో 10 జీపీఏ లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మంజూరు చేసిన అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని, విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు.

తబితా ఆశ్రమం సందర్శన

రామగుండం పట్టణంలోని తబితా ఆశ్రమాన్ని కలెక్టర్ శ్రీహర్ష సందర్శించారు. చిన్నారుల స్థితిగతులు, ఆశ్రమంలో మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై నిర్వాహకుడు వీరేందర్‌నాయక్‌తో మాట్లాడారు. బాగా చదువుకోవాలని పిల్లలకు సూచించారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనుల పరిశీలన

జ్యోతినగర్: దుర్గయ్యపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, గోదావరిఖని గాంధీనగర్ ప్రభుత్వ హైస్కూల్‌లను కలెక్టర్ శ్రీహర్ష బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అభివృద్ధి పనులను పరిశీలించి, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉమ్మడి రామగుండం మండల విద్యాధికారి ఎం.రాజయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఎస్ఈ చిన్నారావు, ఈఈ రామన్, ఏఈ పీఆర్ జావిద్, హెచ్ఎంలు శారద, వాసవి, రేణుక, ఇజ్రాయిల్ తదితరులున్నారు.

కలెక్టర్‌ను సత్కరించిన మేయర్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో కలెక్టర్ శ్రీహర్షను మేయర్ బంగి అనిల్‌కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్క అందించి, శాలువాతో సత్కరించారు. కొంతకాలంగా పట్టణ ప్రగతి నిధులు విడుదల కాకపోవడంతో బిల్లులు, పలు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

సమస్యలపై వినతిపత్రాలు..

రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ శ్రీహర్షను పలువురు కలిసి, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు ఇప్పించాలని మారపెల్లి నవీన్ అనే సివిల్ కాంట్రాక్టర్ కోరారు. 25వ డివిజన్ నుంచి అత్యధికంగా ఎల్ఆర్ఎస్ ఫీజులను వసూలు చేస్తున్నారని, 16 అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని కార్పొరేటర్ నగునూరి సుమలతరాజు తెలిపారు. బల్దియాలో జరుగుతున్న ఇంధన కుంభకోణంపై విచారణ జరిపించాలని డీహెచ్‌పీఎస్, ఏఐటీయూసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు మద్దెల దినేశ్, ఎంఏ.గౌస్ కోరారు. అనంతరం కలెక్టర్ జీజీహెచ్‌ను తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఇన్‌పేషెంట్ వార్డులు, ఓపీ విభాగాలను పరిశీలించారు. సిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ఏసీపీ రమేశ్‌లతో కలిసి ఆస్పత్రిలో వైద్య సేవల తీరుపై డాక్టర్లతో సమీక్షించారు. సాధారణ ప్రసవాలను పెంచాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఆర్ఎంవో అప్పారావు తదితరులున్నారు.

'మనో చైతన్య' కేంద్రం సందర్శన

గోదావరిఖనిటౌన్: స్థానిక మనో చైతన్య మానసిక వికలాంగుల వృత్తి విద్య శిక్షణ ఉపాధి కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ శ్రీహర్ష సందర్శించారు. మానసిక దివ్యాంగులకు అందిస్తున్న శిక్షణను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ స్వర్ణలత, మనో చైతన్య ప్రెసిడెంట్ డి.కృష్ణకుమార్, సీడీపీవో స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు. గోదావరిఖని గాంధీనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సుల్తానాబాద్‌లో ర్యాలీ తీస్తున్న పోలీసులు, విద్యార్థులు

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్‌ను డ్రగ్స్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు యువత, ప్రజలు సహకరించాలని స్థానిక సీఐ సుబ్బారెడ్డి కోరారు. బుధవారం వైద్య సిబ్బంది, పోలీసులు విద్యార్థులతో కలిసి అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వేర్వేరుగా ర్యాలీలు చేపట్టారు. అంతకుముందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాసరచన, ఉపన్యాస, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మొరాజ్, ఎస్సై శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్సై ఓంకార్‌యాదవ్ కోరారు. బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో కాల్వశ్రీరాంపూర్ బస్టాండ్ చౌరస్తాలో మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఏఎస్సై నీలిమ, కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులున్నారు.

కమాన్‌పూర్: మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. కమాన్‌పూర్ మండల కేంద్రంలో స్థానిక ప్రజలు, విద్యార్థులతో ర్యాలీ తీశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు.

ముత్తారం: గ్రామాల్లో మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని ఎస్సై మధుసూదన్‌రావు అన్నారు. బుధవారం ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ముత్తారం–అడవిశ్రీరాంపూర్ చౌరస్తా వరకు విద్యార్థులతో ర్యాలీ తీశారు.

మంథని: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని మంథని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. మంథనిలో బుధవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

ఓదెల: స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది బుధవారం ర్యాలీ తీశారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జావీద్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలని మంథని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సెంటనరీకాలనీ జేఎన్టీయూ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీధర్ రెడ్డి, రామగిరి ఎస్సై సందీప్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

పెద్దపల్లిరూరల్: ఏబీవీపీ బుధవారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని పరిషత్ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ తెలిపారు. పెద్దపల్లి తోపాటు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్ పాటించాయన్నారు. ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరారు.

సుల్తానాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ రిషి డిమాండ్ చేశారు. బుధవారం ఏబీవీపీ పిలుపు మేరకు సుల్తానాబాద్ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని కోరారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని విద్యాసంస్థలు బంద్ పాటించాయి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు నామమాత్రంగా ఉన్నాయని, ప్రభుత్వాలు విద్య విషయంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయని ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ రాసూరి ప్రవీణ్ ఆరోపించారు.

పథకాల అమలుపై అధికారుల పర్యవేక్షణేది?

• పెద్దపల్లి మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల అసంతృప్తి



సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పథకాలు గ్రామస్థాయిలో అమలవుతున్నాయా.. లేదా అనే విషయంలో సంబంధిత అధికారులు పర్యవేక్షించిన పాపానపోవడం లేదని పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. బుధవారం ఎంపీపీ బండారి స్రవంతి అధ్యక్షతన నిర్వహించిన పెద్దపల్లి మండల సర్వసభ్య సమావేశంలో వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. మండలాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని ఎంపీపీ తెలిపారు. నిమ్మనపల్లి, నిట్టూరు గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఆ గ్రామాల ప్రత్యేకాధికారి అలివేణి సభ దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీ సిబ్బంది కుక్కలను పడితే వాటికి ఇంజెక్షన్ వేయిస్తామని పశువైద్యాధికారి కమలాకర్ పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రామ్మూర్తి, విండో చైర్మన్ నర్సింహారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సుదర్శన్ తదితరులున్నారు.

స్పోర్ట్స్ స్కూల్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్: ఈ నెల 29న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పోర్ట్స్ స్కూల్ జిల్లాస్థాయి పోటీలకు ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో సురేందర్ తెలిపారు. బుధవారం సుల్తానాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 25 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పదోన్నతిపై వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీవాణి, ఆసియా బేగం, ప్రణయ్, వెంకటేశ్‌లను సుల్తానాబాద్ మండల ఎస్‌జీఎఫ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. మండల కన్వీనర్ డి.రమేశ్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దివాకర్, రత్నాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ రామగుండంలో ప్రారంభం

జ్యోతినగర్: క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో అంతర్గాం, పాలకుర్తి మండలాల విద్యార్థులకు ఎంపిక పోటీలను బుధవారం హెచ్ఎం జయరాజ్ ప్రారంభించారు. రామగుండం మండలం విద్యార్థులకు గురువారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల విద్యాధికారి రాజయ్య పోటీలను పరిశీలించారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను పెద్దపల్లి ఐటీఐ గ్రౌండ్‌లో జరిగే జిల్లాస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. పీడీ విజయకుమార్, పీఈటీలు పాల్గొన్నారు.

నేడు ఎంపిక పోటీలు

జూలపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి గురువారం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి కవిత ఒక ప్రకటనలో తెలిపారు. జూలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

సీహెచ్‌పీ జీఎంకు సన్మానం



జీఎం నవీన్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు

రామగిరి: సీహెచ్‌పీ జీఎం నవీన్‌కుమార్ ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనుండగా బుధవారం ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. సింగరేణిలో నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న నవీన్‌కుమార్ అందరికీ ఆదర్శమని జీఎం సుధాకర్‌రావు కొనియాడారు. ప్రాజెక్టు అధికారి ఎస్.రాధాకృష్ణ, సీహెచ్‌పీ డీజీఎం కాశీ విశ్వేశ్వరరావు, ప్రాజెక్టు ఇంజినీర్ శ్రీనివాస్, ఎస్ఈ గాబ్రియల్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్జీ–3 ఏరియా ఇంజినీర్‌గా బాధ్యతలు

ఆర్జీ–3 ఏరియా ఇంజినీర్‌గా వై.విజయశేఖరబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జీఎం ఎన్.సుధాకర్‌రావును కలిసి, రిపోర్ట్ చేశారు. జీఎం, ఏరియాలోని వివిధ గనులు, విభాగాల అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

'విశ్రాంత ఉద్యోగులకు ఇబ్బంది కలగొద్దు'

ఉద్యోగ విరమణ పొంది, ప్రతినెలా పెన్షన్ కోసం ఎదురుచూసేవారికి సౌకర్యవంతమైన సేవలు అందించడమే సింగరేణి భవిష్యనిధి కార్యాలయ సిబ్బంది లక్ష్యం కావాలని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. బుధవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో పెన్షన్ అదాలత్ కార్యక్రమానికి గోదావరిఖని రీజినల్ కమిషనర్ హరి పచూరితో కలిసి, హాజరయ్యారు. విశ్రాంత ఉద్యోగులకు ఇబ్బంది కలగకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సీఎంపీఎఫ్ సిబ్బందికి సూచించారు. పీఎఫ్, పెన్షన్ సంబంధిత సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, పర్సనల్ మేనేజర్లు రవీందర్ రెడ్డి, మారుతి, యూనియన్ ప్రతినిధులు ఎంఆర్‌సీ రెడ్డి, కోట రవీందర్ రెడ్డి తదితరులున్నారు.

రేపు ఎన్‌జీసీ పాఠశాలల విద్యార్థులకు పోటీలు

జ్యోతినగర్: జిల్లాలోని ఎన్‌జీసీ(నేషనల్ గ్రీన్ కోర్) పాఠశాలల విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలను డైరెక్టర్ ఎన్జీసీ తెలంగాణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎన్జీసీ జిల్లా కో–ఆర్డినేటర్ గూళ్ల అంజన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే అంశాలపై తెలుగు, ఇంగ్లిష్‌లో కవిత్వం రాయడం, పోస్టర్ తయారీపై ఈ నెల 28న ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లోని ప్రభుత్వ హైస్కూల్‌లో పోటీలుంటాయని పేర్కొన్నారు. ప్రతీ పోటీలో 20 ఎన్‌జీసీ పాఠశాలల నుంచి 8వ, 9వ తరగతులకు చెందిన ఐదుగురు చొప్పున విద్యార్థులు పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు 99089 74000 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాదేవి

మంథని: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమాదేవి సూచించారు. బుధవారం మంథని మున్సిపల్ కార్యాలయంలో వైద్యారోగ్య, మెప్మా, ఇతర శాఖల అధికారులతో సమావేశమయ్యారు. విద్యుత్ సిబ్బంది ఇనుప పోల్స్, చెట్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించి, ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. మున్సిపల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకుంటామని గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు స్మజన్ తెలిపారు. ప్రజల అవసరాలు తెలియజేసేందుకు మున్సిపల్ కార్యాలయ టోల్ ఫ్రీ నంబర్లు 96663 02954, 90598 95197 అందుబాటులో ఉంచినట్లు చైర్‌పర్సన్ పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తదితరులున్నారు.

రాజ్యాంగంలోని అంశాలను తెలుసుకోవాలి



జీఎం వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న టీం సభ్యులు

జ్యోతినగర్: ప్రతిఒక్కరూ రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను తెలుసుకోవాలని సింగరేణి రెస్క్యూ విభాగం జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండంలో స్మార్ట్ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసమానతలను రూపుమాపడానికి రాజకీయ అధికారం కాకుండా రాజ్యాధికారం కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ రాజ్యాంగంలో కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం అందరికీ లభించేలా పాలకులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఈ నెలలో ఉద్యోగ విరమణ చేయనున్న ఆయనను సన్మానించారు. వివిధ కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థల నాయకులు ముక్క సుదర్శన్, మాదాసి రామ్మూర్తి, కాసర్ల వెంకటస్వామి, పులి మోహన్, శ్యామ్, అందుగుల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ



గోదావరిఖనిటౌన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ(బెటర్‌మెంట్) ఫలితాల్లో గోదావరిఖని శారదానగర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థి నిస్ఫూర్తి ఫస్టియర్ సీఈసీలో 500 మార్కులకు 493 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ అంజయ్య తెలిపారు. బుధవారం ఆమెను సత్కరించారు.

మల్లన్న సన్నిధిలో ఆర్డీవో పూజలు

ఓదెల: స్థానిక మల్లికార్జునస్వామి దేవస్థానంలో పెద్దపల్లి ఆర్డీవో రంగయ్య బుధవారం పూజలు చేశారు. తహసీల్దార్ యాకయ్య, డిప్యూటీ తహసీల్దార్ ధీరజ్‌కుమార్ ఉన్నారు.

కవి రాకుమారకు బహుమతి ప్రదానం

కోల్‌సిటీ: గోదావరిఖని కవి రాకుమారను బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సత్కరించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కర్క ముత్తారెడ్డి స్మారకార్థం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థాయి కవితల పోటీలను వసుంధర విజ్ఞాన వికాస మండలి ఇటీవల నిర్వహించింది. ఇందులో రాకుమార ఉత్తమ బహుమతికి ఎంపికయ్యారు.

స్ఫూర్తి పురస్కారాలు అందజేత

జ్యోతినగర్/యైటింక్లయిన్‌కాలనీ: వసుంధర విజ్ఞాన వికాస మండలి స్ఫూర్తి పురస్కారాన్ని ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌కు చెందిన సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకుడు, సమత ఫౌండేషన్ నిర్వాహకులు దుర్గం నగేశ్–ప్రమీల దంపతులు బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అందుకున్నారు. యైటింక్లయిన్ కాలనీకి చెందిన దేవనపల్లి చక్రపాణికి కూడా అవార్డు ప్రదానం చేశారు. హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ నరసింహారెడ్డి, బాల చెలిమి సంపాదకుడు వేదకుమార్, వికాస మండలి చైర్మన్ వైద్యుల మధుకర్‌రెడ్డి వారిని అభినందించారు.

భద్రతతో విధులు నిర్వహించాలి

రామగిరి: నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు అనుక్షణం భద్రతతో విధులు నిర్వహించాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య తెలిపారు. బుధవారం ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 గనిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. 3వ సీమ్ పంచ్ ఎంట్రీ పనులు, లాంగ్‌వాల్ పురోగతిని పరిశీలించి, భద్రత చర్యలపై సూచనలు చేశారు.

తైబజార్ వేలం

మంథని: మున్సిపల్ పరిధి తైబజార్‌ను 2024–25 సంవత్సరానికి గానూ కాంట్రాక్ట్ పద్ధతిలో నిర్వహించేందుకు బుధవారం వేలంపాట జరిపారు. రూ.5.71 లక్షలకు సీపతి రాజు దక్కించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రమాదేవి, వైస్ చైర్మన్ బానయ్య, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు ఉన్నారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

రామగిరి: బేగంపేట శివారులో బుధవారం పేకాడుతున్న ఏడుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రూ.12 వేలు, 5 బైక్‌లు, 7 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం రామగిరి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

రామగిరి: బేగంపేటలో గుడుంబా స్థావరాలపై ఎస్సై సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. కంచల చెరువు సమీపంలో 1,200 లీటర్ల బెల్లం పానకం, సామగ్రిని గుర్తించి, ధ్వంసం చేశారు.

ఎల్కలపల్లిగేట్ గ్రామంలో గ్రామసభ

ఫెర్టిలైజర్‌సిటీ: ఎఫ్‌సీఐ ఎల్కలపల్లిగేట్ గ్రామంలో బుధవారం ఎంపీడీవో శశికళ ఆధ్వర్యంలో 2023–24 ఆర్థిక సంవత్సర పనులపై ఆడిటింగ్ జరిపారు. ఉపాధిహామీ జాబ్ కార్డులున్నా పని కల్పించడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. జీపీ కార్యదర్శి విజయ్ తదితరులున్నారు.

మదేలయ్య ఆలయ వార్షికోత్సవం

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని మదేలయ్య ఆలయ వార్షికోత్సవాన్ని రజకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు వంగళ తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్, నాయకులు, కుల పెద్దలు ఉన్నారు.

సాహు మహరాజ్ జయంతి

గోదావరిఖనిటౌన్: స్థానిక తెలంగాణ అంబేడ్కర్ ట్రస్ట్ భవన్‌లో సాహు మహరాజ్ 150వ జయంతిని బుధవారం నిర్వహించారు. అంబేడ్కర్ నేషనల్ అవార్డు గ్రహీత ఎండీ.నవాబ్, ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన ఇరుగురాల కృష్ణయ్యలను సన్మానించారు. ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, కార్పొరేటర్ పులేందర్, నాయకులున్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

కమాన్‌పూర్: గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కమాన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు అనిల్, లక్ష్మి మల్లు, శంకర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర చందనం మొక్కల పంపిణీ

రామగుండం: అబాది రామగుండంలో కేపీఎస్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధి గోలివాడ ప్రసన్నకుమార్ బుధవారం ఎర్ర చందనం మొక్కలు పంపిణీ చేశారు.

రైతు కూలీ సంఘం పోస్టర్ ఆవిష్కరణ

రామగుండం: ఈ నెల 30న మహబూబాబాద్‌లో నిర్వహించే అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని నాయకులు ఎల్.భీమయ్య తదితరులు కోరారు. బుధవారం రామగుండంలోని కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు.

పెద్దమ్మ బోనాలు

ఓదెల: ఓదెలలో బుధవారం పెద్దమ్మ బోనాలు నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో ఆలయానికి వెళ్లి, పూజలు చేశారు.

పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలి

రామగుండం: గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని ఎంపీడీవో ఎంఏ.అలీం ఆదేశించారు. బుధవారం రామగుండం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల గ్రామస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. చెత్తాచెదారం, డ్రైనేజీల్లో పూడిక తొలగించి, నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్: ప్రజలు డెంగీపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ సూచించారు. బుధవారం సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఫాగింగ్ యంత్రాన్ని ప్రారంభించారు. వర్షాకాలం ప్రారంభమైనందున నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.

విద్యుత్ ఉపకేంద్రంలో నూతన ఫీడర్ ప్రారంభం

ధర్మారం: స్థానిక 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోపాల్‌రావుపేట ఫీడర్‌ను బుధవారం టీజీఎన్‌పీడీసీఎల్ డివిజనల్ ఇంజినీర్ దాసరి తిరుపతి ప్రారంభించారు. సబ్‌డివిజనల్ ఇంజినీర్ కనకయ్య, ఏఈలు ఖాసీం, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

గోదావరిఖనిటౌన్: నీట్‌లో జరిగిన అవకతవకలకు నిరసనగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాగర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి దుర్గ మాట్లాడుతూ.. పరీక్షలో అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.